నయనతార

శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య

"అవును. ఏమాత్రం సందేహంలేదు. ఆయన ఉద్దండ రావు పంతులే ...." అనుకున్నాడు రాజశేఖరం.

తనను రైలు దగ్గరికి వచ్చి కలుసుకోవలసిందిగా ఉత్తరం వ్రాసి తీరా కాళ్లరిగేట్టు స్టేషను ఆ చివరినుంచి యీ చివరి వరకూ వందసార్లు వెదికినప్పటికీ కనిపించని స్నేహితుణ్ణి మనసులో తిట్టుకుంటూ గేటు దగ్గర ఫ్లాట్ ఫారం టికెట్టు యిచ్చి యివతలికి రాబోతున్న రాజశేఖరం తటాలున ఆగి టీ. సి. తో ఘర్షణ పడుతున్న వ్యక్తిని మరింత పరిశీలనగా చూశాడు. అతని సందేహం తీరిపోయింది. ఆయన ఉద్దండరావుగారే.

వేసవికాలపు ఎండ చిటచిట లాడుతున్నది. వెచ్చని గాలి 'రివ్వు' న వీస్తున్నది. టి. సి. తల అడ్డంగా ఊపుతూ ఏమీ లాభంలేదు. మీ రెన్ని కబుర్లు చెప్పినా నేను విననుగాక... వినను .... ఒక్క క్షణం రద్దీ తగ్గేదాకా అలా నుంచుని తర్వాత తీరిగ్గా రశీదు తీసుకుని డబ్బు చెల్లించి వెళ్లండి ...' అంటున్నాడు.

ఉద్దండరావు పంతులు తన ఖరీదైన చేతి కర్రను విలాసంగా ఊపుతూ నిర్లక్ష్యంగా "సరే .... నేను చెప్పవలసిం దేదో చెప్పాను. టిక్కెట్టు పోయింది.... నా దగ్గర చిల్లికానీ కూడా లేదు..... ఆపైన నీ యిష్టం...." అన్నాడు.

రాజశేఖరం తటపటాయిస్తూనే ముందుకు వెళ్లి చేతులు రెండూ జోడించి "నమస్కారం మేష్టారూ !" అన్నాడు.

ఉద్దండరావుగారు ముందు రాజశేఖరం వంక అనుమా నంగా చూసి తర్వాత గుర్తుపట్టి ఒక్క అడుగు ముందుకువేసి "అరె ! నువ్వటోయ్ రాజా ! నువ్విక్కడేం చేస్తున్నావు ?" అని అడిగాడు.

రాజశేఖరం బదులుచెప్పి, "మీ రెక్కడ నుంచి రావడం? మీ అబ్బాయి కులాసాగా ఉన్నాడా ?" అని ప్రశ్నించాడు.

ఉద్దండరావుగారు నవ్వి "ఇంటినుంచే వస్తున్నాను. ఇప్పుడే రైలు దిగాను. మావాడు బాగానే ఉన్నాడు .... ని న్నప్పుడప్పుడు గుర్తుచేసుకుంటూ ఉంటాడు కూడా .... ఇప్పుడయితే దూరదూరంగా ఉంటున్నారు కాని, ఎంతయినా చిన్నప్పటి స్నేహం కదా ....?" అన్నాడు.

రాజశేఖరం "వివరాలన్నీ తర్వాత మాట్లాడుకోవచ్చు. ముందు మీరు వెళ్లి ఆ కారులో కూర్చోండి .... నేను ఒక్క క్షణంలో వచ్చేస్తాను" అన్నాడు.

ఉద్దండరావుగా రతనికి టీ. సి. ని చూపుతూ 'ఈయ నేమిటో గొడవ చేస్తున్నాడు. అదేమిటో విచారించిరా ...." అంటూ చేతి కర్ర ఊపుకుంటూ త్వరత్వరగా నడిచి వెళ్లి కారులో కూర్చున్నాడు.

రాజశేఖరం టీ. సి. వంక "ఏమిట" న్నట్టు చూడగా అతడు రశీదు పుస్తకం యివతలికి తీసి "ఆయన రైలుదిగి చేతికర్ర ఆడించుకుంటూ యివతలికి వచ్చేస్తున్నాడండీ .... 'టిక్కెట్టివ్వ' మని అడిగితే 'లేద' న్నాడు. 'ఊరికే ఏదైనా పనిమీద స్టేషనుకు వచ్చారా ?' అని అడిగితే, 'కాదు. ఫలానా ఊరి నుంచి వస్తున్నాన' ని అన్నాడు. ఆ పరిస్థితిలో నేనేం చెయ్యను ? చెప్పండి .... డబ్బు కట మని అడిగితే చిల్లి గవ్వ లేదంటున్నాడు" అన్నాడు.

రాజశేఖరం పర్సు తీసి "ఎంత అవుతుందో రసీదు వ్రాసి యివ్వండి. డబ్బు చెల్లిస్తాను."

మరు నిముషంలో టీ. సి. రశీదు వ్రాసి యిచ్చి డబ్బు పుచ్చుకున్నాడు. రాజశేఖరం వెనుదిరిగి నడిచివచ్చి కారులో కూర్చుని స్టార్టు చేశాడు.

కారు కదిలిపోతూఉండగా ఉద్దండరావు పంతులు వాక్ప్రవాహం కట్టలు తెంచుకుంది.

"ఇప్పుడు మనం మీ యింటికే కదూ పోతున్నాం?" అని అడిగా డాయన ముందు.

రాజశేఖరం తల ఊపాడు.

ఆయన మళ్లీ "నీకు ఒక మొగపిల వాడూ, ఆడపిల్లా కలిగినట్టు మావా డెప్పుడో చెప్పినట్టు జ్ఞాపకం .... ఏమాత్రం వయసుంటుందేమిటి వారికి ?" అని అడిగాడు.

రాజశేఖరం "పెద్దవాడికి మొన్న డీసెంబరు నెలతో అయిదేళ్లు వెళ్లి ఆరో ఏడు వచ్చింది. చిన్న పిల్లకు మూడో సంవత్సరం. నడుస్తున్నది." అన్నాడు.

ఆయన నిట్టూర్చి "అలాగా! అయితే నీకిప్పుడప్పుడే ఆడపిల్లల పెళ్లిళ్లూ, తొందరా లేదన్నమాట. అదృష్టవంతుడివి." అన్నాడు.

తర్వాత కొద్ది క్షణాలాగి "నేను రిటైరయి ఎనిమి దేళ్లయింది. ఏదో ఒంట్లో ఓపిక ఉన్నంత కాలమూ పని చేశాను. ఇంతలో మావాడు చేతికంది వచ్చాడు. బరువు బాధ్యత లన్నీ వాడి చేతుల్లో ఉంచి ప్రశాంతంగా ఉందామనుకున్నాను. ఏదీ? ఈ మనసుకిప్పుడల్లా ప్రశాంతత లేదు. ఏదో ఒక సమస్య వేధిస్తూనే ఉంది..." అన్నాడు.

రాజశేఖరం "అదేమిటి మాష్టారూ! మీకు సమస్య లేమిటి? మీరు సంపాయించినంత సంపాయించారు. ఒకళ్ల కింత పెట్టి పోషించారు. ఒక్కగా నొక్క కొడుకును పెద్ద చదువులు చదివించారు. ఒక ఇంటి వాణ్ణి చేశారు. అదీగాక మీ వాడు తక్కువ వాడేం కాదు గదా? నెల తిరిగేసరికి పది హేను వందల రూపాయలు జీతం తెస్తున్నాడు. ఎవరూ వేలెత్తి చూపడానికి వీలులేని స్వభావం అతనిది. ఇక మీకు దేన్ని గురించి చింత?" అని అడిగాడు.

ఉద్దండయ్య పంతులు మాట్లాడలేదు. ఎటో చూస్తూ కూర్చున్నాడు. రాజశేఖరమే మళ్లీ "మీ కోడలు... మిమ్మల్నేమయినా సరిగా చూడటం లేదా?" అని అడిగాడు.

అతని నోటిమాట నోట ఉండగనే ఉద్దండరావు పంతులు ముక్కున వేలువేసుకుని "అమ్మో! అంతమాట అనకు రాజా! నా కోడలు వంటి మనిషి లక్షల్లో,కూడా మరొకతె కనిపించదు. మే మీ మాత్రంగానైనా హాయిగా ఉన్నామంటే అంతా దాని చలవే.!! అన్నాడు.

రాజశేఖరం మౌనంగా కారు నడుపుతూ కూర్చున్నాడు. కారు వేగంగా సాగిపోతున్నది. అతడు ఒక్కసారి ఉద్దండరావు పంతులు మొహం వంక చూసి తల తిప్పుకున్నాడు.

ఉద్దండరావు పంతులు రాజశేఖరానికి హైస్కూలులో స్కూల్‌ఫైనల్ వరకూ క్లాసు టీచరు. రాజశేఖరం తండ్రి పోయిన తర్వాత అతనికి గార్డియన్‌గా కూడా వ్యవహరించాడు. ఆయన వయస్సులో ఉండగా పేరుకు తగ్గట్టుగా గంభీరంగా, ఉండేవాడు. హెడ్మాష్టరుకు ఆయనపట్ల ఎంతో గౌరవమూ ఆదరణ ఉండేవి. ఇతర ఉపాధ్యాయులకు చక్కని స్నేహభావం ఉండేది. విద్యార్థులు సరేసరి. ఆయనపట్ల ఎంతో భక్తి ప్రపత్తులు కలిగి ఉండేవారు. స్కూల్ మాష్టారుగా రిటైరైన తర్వాత కాస్త విశాలమైనదిగా స్వంత ఇల్లు కట్టుకొని స్థిర పడ్డాడు. అంతకుముందే ఆయన ఒక్కగానొక్క కొడుకు ఇంజనీరింగ్‌లో పెద్ద చదువులు చదివి చిన్న చిన్న ఉద్యోగాలేవో వస్తే కాదని చివరకు ఏదో ఫ్యాక్టరీ మేనేజరుగా చేరాడు. అతనికి మొదట్లో ఏడెనిమిది వందలు ఇచ్చేవారు. తర్వాత అతడు ఇతరదేశాలు కూడా వెళ్లి మరింత ఉన్నతమైన డిగ్రీలు తెచ్చు కోవడమూ జరిగింది. అతనికి తండ్రి అంటే ఎంతో భక్తి. దేవుడిలా చూసుకుటాడు. చిన్నప్పటినుంచీ తల్లిలేని తనను తల్లీ తండ్రీ తనే అయి పెంచిన కారణంగా ఆయన అంటే అతనికి ఎంతో ప్రేమ... అతనికీ రాజశేఖరానికి మొదటినుంచీ మంచి స్నేహం. ఇద్దరూ ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో వేరుగా బ్రతుకు తున్నప్పటికీ ఒకరినొకరు మరిచిపోలేదు. అలా అని ఇద్దరి మధ్య ఎడతెగని ఉత్తరప్రత్యుత్తరాలు, రాకపోకలూ కూడా లేవు. నిజానికి ఉద్దండరావు పంతులను రాజశేఖరం కలుసుకోవడం చాలా ఏళ్ల క్రిందటి సంగతి.

అతడు కారును నడుపుతూనే మళ్లీ ఒకసారి ఉద్దండ రావుపంతులు ముఖంలోకి చూశాడు. ఆయనలో ఏమార్పూ లేదు. ఉదాసీనంగా కూర్చుని బయటికి చూస్తున్నాడు.

రాజశేఖరం "ఇంతకూ మీ మనసులో దేమిటో చెప్పారు కారు...." అని అడిగాడు మళ్లీ.

ఆయన కళ్లజోడు సర్దుకొని అతని వంక తిరిగి ఒక్క క్షణం ఆగి "ఏమీ లేదులే, అన్నట్లు ఇంకా ఎంత దూరం వెళ్లాలి మనం?" అన్నాడు.

"మరొక అరమైలు... అంతే." అని సమాధానం చెప్పాడు రాజశేఖరం.

ఒక్క నిముషం నిశ్శబ్దం తర్వాత ఉద్దండరావు పంతులు రాజశేఖరం భుజం తట్టి, లాల్చీ జేబులో నుంచి దేన్నో తీసి గుప్పిటలో ఉంచుకుని "ఇలా చూడు. ఇదేమిటో చెప్పుకో." అన్నాడు.

రాజశేఖరం నవ్వి "ఎలా చెప్పగలను?" అన్నాడు,

ఆయన గర్వంగా చూస్తూ తన చేతిలో వస్తువును అతనికి చూపించాడు. అది చూడగనే రాజశేఖరం నోట మాట రాలేదు. అతడు నివ్వెరపోయాడు. అది రైలు టికెట్టు.

ఆయన ఒక్క క్షణం ఆగి తన లాల్చీ రెండవ జేబులో నుంచి అయిదు వందల రూపాయల నోట్లను తీసి రెప రెపలా డిస్తూ లెక్కపెట్టి మళ్లీ జేబులో ఉంచుకొని రాజశేఖరం వంక చూసి నవ్వాడు. తర్వాత తనలో తాను గొణుక్కుంటూ "మా మనమరాలు రైలు టికెట్టు కావాలన్నది. ఎలాగూ రైల్లో వచ్చాను గదా? ఆ టికెట్టు వాడికిచ్చేస్తే నా మనమరాలికేం చేప్పేది.?" అన్నాడు.

రాజశేఖరం కొద్దిగా షాక్ తిని తేరుకుని జాగ్రత్తగా కారు మలుపు తిప్పి ఇంటి ముందు ఆపి హారన్ మోగించాడు.

* * * *

హారన్ మోత విని డాబా పంచలో ఆడుకుంటున్న రవీ, రేణుకా ఇద్దరూ పరుగెత్తుకుంటూ గేటు దగ్గరికి వచ్చారు. ఉద్దండరావు పంతులు కారు దిగి "ఇదేనా మీ ఇల్లు...బాగుంది." అన్నాడు. రాజశేఖరం "రండి లోపలికి... ఇడుగో వీడే మా పెద్దవాడు. పేరు రవి.... ఇది చిన్న పిల్ల రేణుక" అన్నాడు.

పిల్లలిద్దరూ ఉద్దండరావు గారి వంక చిత్రంగా చూస్తూ నిలబడ్డారు. ఆయన చూపులు చిన్నపిల్ల మీద నిలిచాయి. దాని వంక కన్నార్పకుండా కొద్ది క్షణాలు చూసి ఆయన ఒక్క ఉదటున ఎత్తుకుని ముద్దుపెట్టుకోబోయాడు. ఆ పిల్లకు కొత్త లేకపోయినా 'అయిష్మత' ఉంది. ఆయన చేతుల్లోనుంచి గింజుకొని క్రిందికి దూకి లోపలికి పరుగెత్తి పోయింది.

ఉద్దండరావు పంతులు నవ్వుతూ ముందుకు నడిచాడు, ముందు హాల్లో వసంత ఎదురై భర్తను పలకరించబోయి వెనక కొత్త మనిషిని చూసి ఆగిపోయింది.

రాజశేఖరం "వసంతా! నేనప్పుడప్పుడు చెబుతూఉంటానే మా మేష్టారు....వీరే.... ఇప్పుడే రైలుస్టేషను దగ్గర కనిపిస్తే తీసుకొచ్చేశాను..." అన్నాడు.

ఆమె 'అలాగా' అని ఉద్దండరావు పంతులు గారి వైపు తిరిగి "ఉండండి. కాళ్లు కడుక్కునేందుకు నీళ్లు తెస్తాను.' అంటూ లోపలికి వెళ్ళింది.

ఉద్దండరావు పంతులు కాళ్లు కడుక్కొని చేతి కర్ర ఒక మూల ఉంచి కాస్సేపు పడక కుర్చీలో చేరగిల బడి కళ్లు మూసుకున్నాడు. రాజశేఖరం ఆయనను పలకరించబోయి మళ్లీ మానుకొని "కాస్సేపు ఆగి వంట అయిన తర్వాత లేపవచ్చు. ఈ లోపల మనం స్నానం ముగిద్దాం." అనుకుంటూ లోపలికి వెళ్లాడు.

అతడు స్నానం ముగించి వచ్చేసరికి ఆయన అలాగే పడుకుని ఉన్నాడు. దగ్గరగా నిలబడి "లేచి స్నానం చెయ్యండి మేష్టారూ! త్వరగా భోజనాలు ముగించేద్దాం. మీరు ఎప్పుడన్న తిన్నారో ఏమో!" అన్నాడు.

ఆయన లేచి ఒళ్లు విరుచుకున్నాడు. తాను తొడుక్కుని ఉన్న లాల్చీ విప్పి ఒంకెకు తగిలించి దాని జేబులో వున్న అయిదు వంద రూపాయల నోట్లనూ తీసి రాజశేఖరం చేతికిచ్చి 'నీ దగ్గర ఉంచు' అంటూ స్నానాల గది వైపు నడిచాడు.

రాజశేఖరం ఆయనకు దోవచూపి టవల్స్ అందించి మళ్లీ మధ్య గదిలోకి తిరిగి వచ్చి ఆ డబ్బును సేఫ్‌లో ఉంచి నిట్టూర్చాడు.

* * * *

భోజనాలు పూర్తి కాగానే రాజశేఖరం బట్టలు వేసుకొని "మేష్టారూ! మీరు మధ్యాహ్నందాకా బాగా రెస్టు తీసుకోండి. నేనొకసారి ఆఫీసుకు వెళ్లి రావాలి. సాయంకాలం నాలుగు గంటల కల్లా వచ్చేస్తాను. తర్వాత ఇద్దరం ఎక్కడైనా పోదాం..."అన్నాడు.

ఉద్దండరావు తలఊపి "ఎక్కడైనా పోవడం కాదు. నాకు ముఖ్యమైన పనులున్నాయి. నువ్వు త్వరగా రా..."అన్నాడు.

వసంత ఒక గదిలో ఆయనకు మంచం వాల్చి వచ్చి "బాబూగారూ! మీరు ఆ గదిలోకి వెళ్లి పడుకోండి. పిల్లలెవరూ అటువైపురారు. మీకు నిద్రాభంగం కాదు." అన్నది.

ఆయన అలాగే కూర్చుని "అలాగేనమ్మా" అన్నాడు. కాని లేవలేదు. కొద్దిక్షణాలు ఆగి ఉన్నట్టుండి "అమ్మాయీ! మీ యెరకలో చుట్టుపక్కల మంచి సంబంధాలున్నాయా ? మా మనవరాలి పెళ్లి నాకొకసమస్యగా ఉందమ్మా." అన్నాడు.

వసంత భోజనానికి కూర్చుంటూ "పిల్లకెన్నేళ్లు ఉన్నా యేమిటి?" అని అడిగింది.

ఆయన త్వరత్వరగా "రేపు మాఘమాసానికి పదహారో సంవత్సరం ప్రవేశిస్తుంది. నాకు బాధ్యత తప్పదుకదా! మా వాడేమో ఏ విషయమూ పట్టించుకోడు, వాడిలోకమే వాడిది. ఇక కోడలు ఉన్నదంటే... ఆడది— ఏం చెయ్యగలదూ? అక్కడికీ మావాడికి అనేక విధాల చెవి నిల్లుకట్టుకుని చెప్పిచూశాను. వాడు వింటేనా? అయినా పెద్దవాళ్లు ఎంతకాలమని అన్ని పనులూ చేసిపెడుతూ ఉండగలరంటావు? ఏమిటో! నాకు ఆ పిల్ల పెళ్లి బ్రహ్మాండమైన సమస్య ఇప్పుడు......నిద్రాహారాలు సరిగా లేవనుకో... మంచి వరుణ్ణి చూడాలి... వాళ్లు మనకు అన్ని విధాలా తగిన వారుగా ఉండాలి... కట్నం కానుకల విషయంలో అట్టే పేచీలేదనుకో...నచ్చితే అడిగినంత మొహాన పారేస్తాము. అన్నిటికన్నా ముఖ్యం పిల్లవాడు నచ్చాలి...పిల్లకు అన్ని విధాలా తగినవాడై ఉండాలి... ఇన్నీ కుదిరి ఆ మూడు ముళ్లూ వేయించేస్తే తర్వాతంటావూ ... బెడద తీరిపోతుంది. హాయిగా కృష్ణా

రామా అనుకుంటూ ఒక మూల కూర్చుండి పోతాను. పిలుపు వచ్చేవరకూ....''అన్నాడు.

ఇంత సేపూ ఆయన కళ్లలో, కంఠస్వరంలో చిత్రమైన బాధ గోచరించింది. వసంత అనునయంగా చూసి ''అలాగే లెండి బాబుగారూ! ఆయన రాగానే మాట్లాడి ఏమైనా సంబంధాలున్నాయేమో ఆలోచిద్దాం. ముందు మీరు వెళ్లి విశ్రాంతి తీసుకోండి.'' అన్నది.

''ఆఁ! ఏం విశ్రాంతో! కళ్లుమూస్తే ఇదే మనసును వేధిస్తున్నది!!'' అంటూ ఆయన లేచి ముందు గదిలోకి వెళ్లి పడుకున్నాడు.

పది, పదిహేను నిముషాల తర్వాత వంట ఇంట్లో పని ముగించుకొని, వసంత పిల్లల నిద్దరినీ 'అటువైపు వెళ్లవద్దనీ', 'గోల చేయవద్దనీ' హెచ్చరించి ఆగది గుమ్మంలో నిలబడి లోపలికి తొంగి చూసింది. ఉద్దండరావుపంతులు గురకపెడుతూ హాయిగా గాఢంగా నిద్రపోతున్నాడు.

రాజశేఖరం తిరిగి వచ్చేసరికి ఆయన లోపల గదిలో పీట మీద కూర్చుని వసంతతో ఏదో మాట్లాడుతున్నాడు, ఆమె ఆయన చెబుతున్న విషయాలు వింటూ మధ్య మధ్య ఊఁకొడుతూ ఉండి, ఉండి ''అలాగా!'' అంటూ తన పని చూసుకుంటున్నది. పిల్లలిద్దరూ, ముఖ్యంగా రేణుక, ఉద్దండరావు గారి బుంగ మీసాలకు భయపడి బిక్కు బిక్కు మంటూ చాటుచాటుగా తిరుగుచున్నారు. ఆయన అంతకుముందు ఎంత లాలించి పిలిచినా ఆ పిల్ల రాతిబొమ్మలా నుంచున్నదే తప్ప ఆయన దగ్గరికి వెళ్లలేదు.

రాజశేఖరం లోపలికి వచ్చి చొక్కా విప్పుతూనే ''ఇదేమి దారుణమే వసంతా! మా మేష్టార్ని పీటమీద కూర్చోబెట్టి మాట్లాడుతున్నావు!'' అన్నాడు.

ఆమాటలు విని వసంత నవ్వి ''నేనెంత దూరమో చెప్పి చూశానండీ బాబూ, ఆయన వింటేనా? వాళ్ల ఇంట్లో మధ్యాహ్నం కాఫీ వేళకు వంట ఇంట్లో ఇలాగే కోడలితో కబుర్లు చెబుతూ కూర్చోడం ఆయనకు అలవాటుట'' అన్నది.

ఉద్దండరావు పంతులు వెనక్కు తిరిగి ''నీ భార్యకూ నా కోడలికీ పోలిలున్నాయోయ్ రాజా! అదీ ఇంతే. నేను చెప్పే కబుర్లన్నీ వింటూ తలఊపుతూ తన పని తాను చేసుకుపోతుంది. ఒక పసిపిల్లవాణ్ణి చూసినట్లే చూస్తుందనుకో నన్ను. నాకు డాక్టర్లు లక్ష ఆంక్షలు పెట్టారు. ఎప్పుడూ ఏవో టానిక్కులూ. వేళ తప్పకుండా భోజనం... అందులో చప్పటి కూరలు..ఎక్కువ కారమూ, ఉప్పూ, పులుసూ...ఏదీ తినేందుకు వీలులేదు. చలిగాలి, మంచూ, ఎండా, ఏదీ ఒంటికి తగలరాదు. ఊరికే ఇరవైనాలుగ్గంటలూ గోళ్లుగిల్లుకుంటూ ఇంట్లో కూర్చోవాలి.....'' అన్నాడు.

తర్వాత ఒక్క క్షణం ఆగి నెమ్మదిగా ''అందుకే నేను మా మనవరాలితో రకరకాల ఆటలు ఆడుతుంటాను. అదీ ఇంట్లో ఎవరూ లేనప్పుడే...మిగిలిన సమయాల్లో అది కూడా నాతో మాట్లాడదు. ముంగిలా కూర్చుంటుంది. ఎవరూ లేనప్పుడు దానితో కారమ్సు, పేక, అన్నీ ఆడుతుంటాను.. నిజానికి నన్నర్థం చేసుకున్నదాయింట్లో మామనవరాలొక్కతే..'' అన్నాడు. ఆయన కళ్లు మెరిశాయి.

రాజశేఖరం కాళ్లు కడుక్కునిరాగానే వసంత ఇద్దరికీ ఫలహారం సిద్ధంచేసింది. ఉద్దండరావు పంతులు ఫలహారానికి ఉపక్రమిస్తూ గంభీరంగా ''ఏమోయ్ రాజా! మా మనవరాలికి మంచి సంబంధమేదైనా చూసి పెట్టవోయ్.'' అన్నాడు.

అది విని రాజశేఖరం తలఎత్తి ''మీకు పెళ్లియీడుకు వచ్చిన మనవరాలుందా మాస్టారూ?'' అని అడిగాడు.

ఆయన ''సరే బాగానే ఉంది..అదేమిటోయ్, అలాఅడుగుతావు? ఆడపిల్లలు ఎంతలోకి ఎదుగుతారు? నిన్నమొన్నటిదాకా అది చిన్న పిల్లే...అయితేనేం? పదిహేనేళ్లు నిండుతున్నాయ్. మరి...బాధ్యత కలవాణ్ణి నా ప్రయత్నాలు నేను చెయ్యవద్దూ?'' అన్నాడు.

రాజశేఖరం తలఊపి ''అలాగా? అయితే చుద్దాం లెండి.' అన్నాడు.

ఉద్దండరావు పంతులు ''అదిగో!'' చూద్దాం లెండి! అని తప్పించుకుంటే లాభంలేదు. వివరాలన్నీ చెబుతాను, విను. నా సంగతి నీకు తెలుసుగదా! మా వాడి సంగతి కూడా బాగా తెలుసు, మా అంతస్థు యోగ్యతా కూడా నీకు తెలుసు. ఇక నా మనమరాలిని గురించి....ఇప్పుడే చెప్పాను గదా? దానికి పదహారో యేడు రాబోతున్నది. మనిషి బంగారపు బొమ్మలా ఉంటుంది. నా నోటితో చెబితే పొగడ్త అనుకుంటావు. దాని ఒంటి మీద బంగారం కనిపించదసలు. ఇక కను ముక్కు తీరు చెప్పనే అక్కర్లేదు ... చిదిమి దీపం పెట్టుకోవచ్చు... ఎటువంటి ఇంటికైనా వెలుగు తీసుకు రాగల యోగ్యురాలు. దాని నెమ్మదీ, ఓర్పూ, సహనమూ నేను చూసిన ఆడపిల్లల్లో ఎక్కడా లేవు. లక్షమందిలో వెదికినా అట్లాంటి పిల్ల దొరకదు.'' అంటూ వసంత వైపు తిరిగి ''అమ్మాయ్ వసంతా! ఇతర విషయాలెలా ఉన్నా నీకూ దానికీ ఒక్క పోలిక ఉంది. నీకు మల్లేనే దానికి కూడా నవ్వినప్పుడు బుగ్గలు అందంగా సొట్టలు పడతాయి'' అన్నాడు.

రాజశేఖరం వసంతవైపు కొంటెగా చూశాడు. ఆమె సిగ్గుతో తల దించుకున్నది.

ఉద్దండరావు పంతులు గొంతు మార్చి "ఇక దాని పేరేమిటో తెలుసా? నయనతార. ఎలా ఉంది పేరు? అందంగా లేదూ? నేనే పెట్టాను దానికాపేరు." అన్నాడు గర్వంతో.

రాజశేఖరం కళ్లముందు పదహారేళ్ల బంగారపు బొమ్మ వంటి మెరుపుతీగ వంటి అద్భుత సౌందర్యవతి రూపం కట్టి నల్లైంది. ఆ పేరు అతని చెవులకు అద్భుతంగా ధ్వనించింది. నయనతార! ఎంత అందమైన పేరు!

ఉద్దండరావు పంతులు ప్లేటులో చెయ్యి కడుకుంటూ "ఏమయ్యా, నేనడిగిన దానికి త్వరగా జవాబు చెప్పూ? నీ ఎరుకలో చుట్టుపక్కల ఏవైనా మంచి సంబంధాలున్నాయా?" అని అడిగాడు.

రాజశేఖరం ఆలోచనలోపడ్డాడు. వసంత కాఫీ కప్పులో పోసి అందిస్తూ "అన్నట్టు...ముష్టి వారబ్బాయి నాగరాజు ఉన్నాడుగా! చక్కగా ఇంజనీరింగ్ పూర్తి అయిందని మొన్ననే మీరన్నారు. వారిని కనుక్కో రాదూ?" అన్నది.

రాజశేఖరం చిటికెవేసి "అవును సుమా! బాగా గుర్తు చేశావు. ఆ సంబంధం మంచిదే...." అన్నాడు.

ఉద్దండరావు పంతులు కాఫీ చప్పరించి "అదేమిటమ్మా అమ్మాయ్! ముష్టివాళ్లతో సంబంధమేమిటి?" అన్నాడు.

రాజశేఖరం అదిరిపడి "బాబోయ్! వారి ఇంటి పేరు ముష్టి వారండీ....మనవాళ్లే...లక్షాధికారులు...."అన్నాడు.

ఉద్దండరావు కాఫీ కప్పు క్రింద ఉంచి పై పంచెతో మూతి తుడుచుకొని "ఇంతకీ పిల్లవాడెలా ఉంటాడో చెప్పవేం" అని అడిగాడు.

రాజశేఖరం "ఒస్తున్నానుండండి మరీ "..అని తనకుతానే ఒక పెద్దరికం అవలంబించి, కాఫీ తాగడం ముగించి నింపాదిగా "కుర్రవాడికి ఇరవైనాలుగేళ్లు ఉంటాయి. ఇంజనీరింగ్ పూర్తి అయింది. మనిషి చాలా శుభ్రంగా, అందంగా ఉంటాడు. పచ్చగా దబ్బపండులా ఉంటాడు. పెద్దలంటే భయమూ, భక్తీ ఉన్నాయి. తల్లితండ్రులకు ఒక్కడే కొడుకు.. పేరేమో నాగరాజు" అని చెప్పాడు.

ఉద్దండరావు పంతులు ఒక్క ఉదటున లేచి"అయితే వెంటనే బయలుదేరు...పద గుడ్డలు మార్చుకో..అమ్మాయ్! నా చేతికర్ర ఇలా అందుకో అమ్మా, ఆ చేత్తోనే పంచాంగం కూడా తీసుకురా....వర్జ్యం ఉందేమో చూద్దాం. ఆ బల్లమీద కళ్లజోడు పెట్టాను. చూడు..ఇంకా అలాగే కూర్చున్నావా రాజా నువ్వు?" అంటూ తొందర పెట్టాడు.

* * * *

ఇద్దరూ వీధిలోకివచ్చారు. ఉద్దండరావుపంతులు నడుస్తూ "మనం వెళ్లి ముందు పిల్లవాణ్ణి చూద్దాం. నచ్చితే వారిని వచ్చి పిల్లను చూసుకోమని అడుగుదాం. ఆ అడ్డంకికూడా తీరితే ఆపైన ఇతర వ్యవహారాలన్నీ మాట్లాడుకుని తాంబూలాలు పుచ్చేసుకుందాం" అన్నాడు.

"అలాగేలెండి. వాళ్లు నాకు బాగా తెలుసు. వారి ఇంట్లో ఒకడినిగా తిరుగుతూ ఉంటాను నేను. అలాగే చేద్దాం". అన్నాడు రాజశేఖరం.

అలా ఇద్దరూ పది నిముషాలు సేపు నడచి ఒక పెద్ద భవంతి ముందు ఆగారు. అది రెండంతస్థుల మేడ. ఇంటిముందు విశాలమైన ఆవరణ, అందులో రకరకాల మొక్కలు చెట్లు ఉన్నాయి. ప్రహరీ గోడకు ఒకవైపున 'కుక్కలున్నవి జాగ్రత్త' అని చిన్న బోర్డు ఉంది.

పంచలో పేము కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్న వ్యక్తి గేటు తీసిన సవ్వడి విని, తలతిప్పి చూసి, లేచి నిలబడి "రావోయ్ రాజా! ఏమిటి, ఇవాళ దోవ తప్పినట్టున్నావే! నిన్ననే మా పిన్నమ్మ నీ విషయం గుర్తుచేసుకొని 'కనిపించడం లేదెందుకో' అన్నది కూడా". అన్నాడు

రాజశేఖరం మెట్లెక్కుతూ "ఎప్పుడూ ఏదో ఒక పని, అందునా సీజను కదా! ఊపిరి సలపటం లేదు... లేకపోతే మీ ఇంటికి రావడానికేం చేదా? చక్కగా వచ్చినప్పుడల్లా కాఫీలూ టిఫిన్లూ ఇస్తూ ఉంటారు కూడా..... " అన్నాడు.

తర్వాత ఉద్దండరావు పంతులు గారిని పరిచయం చేస్తూ "వీరు మేష్టారు. నేనీ మాత్రంగానైనా ఉన్నానూ అంటే అది అంతా వీరి చలవే... టీచరుగానే కాకుండా నాకు గార్డియన్ గాకూడా ఉండే వారు. చిన్నతనంలోనే మా నాన్న పోయాడా? ఆ తర్వాత పెద్ద దిక్కు అంటూ లేని నన్ను కన్న కొడుకుతో సమానంగా చూసుకున్నారు. ఇప్పుడీ ఉద్యోగాల మూలంగా దూర దూరమై పోయాము. వీరి అబ్బాయి పెద్ద ఇంజనీరు. విదేశాలకు కూడా వెళ్లివచ్చాడు. నెలకు పదిహేను వందల రూపాయలతనికి జీతం...."అని చెప్పాడు.

తర్వాత ఆ వ్యక్తిని చూపించి ఉద్దండరావు పంతులుతో "వీరు విశ్వనాథంగారు, ఇన్‌కంటాక్సు ఆఫీసరుగా రిటైరయినారు." అన్నాడు.

వారిద్దరూ 'ఒహో' అంటే 'అలాగా' అనుకుని కుర్చీలలో కూర్చున్నక తరువాత అతడు ఉద్దండరావు పంతులుతో "మీ

రిద్దరూ మాట్లాడుకుంటూ ఉండండి; మేష్టారూ, నేను మా పిన్నమ్మకు కనిపించి వస్తాను.'' అంటూ లోపలికి వెళ్ళాడు.

*　　*　　*　　*

అతడు ''పిన్నమ్మా! ఎక్కడున్నావు?'' అని కేకవేస్తూ వంట గదిలోకి వెళ్ళాడు, ఆమె పెరట్లో ఎవరితోనో మాట్లాడుతూ ఉంది కాబోలు కేక విని లోపలికి వచ్చి ''నువ్వు ట్రా అబ్బాయీ! చేరి తప్పి వచ్చినట్లున్నావే....'' అన్నది.

రాజశేఖరం పీటమీద కూర్చుంటూ ''ఇప్పుడే చిన్నాయన ఆ మాట అన్నాడులే.. మళ్లీ నువ్వు అనడం దేనికి?'' అన్నాడు.

ఆమె ఫ్లాస్కులోనుంచి కప్పులోకి కాఫీ ఒంచి అతని ముందు పెట్టింది. అతడు దాన్ని అందుకుని ఒక్క గుటకవేసి ''అన్నట్టు మన అభిమన్యుడెక్కడా కనిపించడేం?'' అని అడిగాడు.

ఆమె కూర్చుంటూ ''వాడికి ఏమీ తోచటం లేదుట–షికారుకని వెళ్ళాడు... ఇంటికి వచ్చి పట్టుమని పది రోజులైనా కాలేదింకా...వాడి కప్పుడే మొహంమొత్తింది. ...'' అన్నది.

''అవునుమరి ... హాస్టళ్లల్లో హాయిగా గోలచేస్తూ సరదాగా ఉండి వచ్చిన వాడికి ఇక్కడేం బాగుంటుందిలే. పోనీ, తొందరగా వాణ్ణొక ఇంటివాణ్ణి చేసెయ్యరాదూ పిన్నమ్మా! నీ బాధ్యతలూ తప్పుతాయి... వాడి తిరుగుడూ తగ్గుతుంది. కట్టేసినట్టు ఇంట్లోనే పడుంటాడు...'' అన్నాడు రాజశేఖరం.

ఆమె నిట్టూర్చింది. ''ఆ రోజు రావాలిగా నాయనా! మన చేతిలో ఏముంది చెప్పు... వాడు కూడా ఇప్పటివాళ్లలాగా పెళ్లిచేసుకోనని మొండి కెత్తడం లేదనుకో...అయినా ఆ ఘడియ రావద్దూ.....'' అన్నది.

రాజశేఖరం కప్పు క్రింద ఉంచి ''ఆ ఘడియ వచ్చిందిలే.. లేకపోతే నిక్షేపంలాగా గడప దాటకుండా కాలం గడిపే శ్రీ శ్రీ శ్రీ ఉద్దండరావు పంతులు గారు, అస్మదీయ గురువర్యులు, పితృతుల్యులు, పదిహేను వందల రూపాయల జీతగాడి తండ్రి, అనవసరంగా స్టేషను దగ్గర నాకెందుకు తారసపడినట్టు? పడెనుపో మా ఇంటికి వచ్చి మనవరాలి పెళ్లి సంగతి తనకు అర్జంటనీ, సంబంధాలు చూడమని నన్నెందుకు అడిగినట్టు? అడిగెనుపో మా ఆవిడకు మెరుపు మెరిసినట్టు మీ సంబంధం ఎందుకు గుర్తు వచ్చినట్లు? ఇదంతా చూస్తే మన అభిమన్యుడికి కళ్యాణ ఘడియలు దగ్గరికి వచ్చినట్లే అనిపిస్తుంది...'' అన్నాడు.

ఆమె కళ్లు పెద్దవి చేసి ''ఏమిటి నువ్వు చెబుతున్నది?'' అని అడిగింది.

''నిజం పిన్నమ్మా! వాకిట్లోకి వెళ్లి చూడు. చిన్నాన్న, మా మేష్టారూ, ఈపాటికి శాఖలూ, గోత్రాలూవంటి మైనర్ పాయింట్లు మాట్లాడేసుకుని ఉంటారు. ఇక 'మా అమ్మాయిని చూసుకునేందుకు మీరు సకుటుంబంగా, అంటే భవదీయుడితో కూడా బయలుదేరి రమ్మని మా మేష్టారు అడగటమూ, చిన్నాన్నా 'సరే' ననటమూకూడా మరికొన్ని నిముషాల్లో జరగబోతున్నది...'' అన్నాడు రాజశేఖరం.

ఆమె గబ గబా ముందు హాల్లోకి వెళ్లి గుమ్మం వెనక నిలబడి తొంగిచూసి తిరిగివచ్చి ''నిజమేరా, అన్నట్టు పిల్ల ఎలా ఉంటుందో?'' అని అడిగింది.

రాజశేఖరం కాఫీకప్పు ముందుకు నెట్టి ''మరి కొంచెం కాఫీ పొయ్యి పిన్నమ్మా! నీ చేతి కాఫీ బలే రుచి...'' అని అడిగి పోయించుకుని నెమ్మది నెమ్మదిగా గుటకలు వేస్తూ'' నేను మాత్రం పిల్లను చూశానా? అయినా ఆయన చెప్పిన వివరాల ప్రకారం ఆ పిల్ల చాలా బాగుంటుందనీ, సద్గుణాలు రంగరించి పోసి పెంచారని తెలుస్తున్నది. వయసేమో పదిహేనో యేడు వెళ్లబోతున్నట్టు కూడా చెప్పారాయన. ఇక కుటుంబమూ, సాంప్రదాయమూ అంటావా? ఎవరూ వేలెత్తి చూసపడానికి వీల్లేదు. చాలా ఉత్కృష్టమైన కుటుంబం'' అన్నాడు.

తర్వాత ఒక్క క్షణం ఆగి ''పిల్ల పేరేమిటో చెప్పనా? నువ్వెన్నడూ అంత మంచి పేరు వినికూడా ఉండవు...నయనతార. నయనతార.....''అన్నాడు.

''ఆమె, సరే చూద్దాం కానీ... ఆభగవంతుడెక్కడ రాసి పెట్టాడో........''అన్నది.

రాజశేఖరం వరండాలోకి వచ్చేసరికి పెద్దలిద్దరూ ఏదో విషయం మీద నవ్వుకుంటూన్నారు. విశ్వనాథం గారు ఒక్కక్షణం ఆగి ''అలాగే లెండి. మా వాడు కూడా సెలవులకు ఇంటికి వచ్చాడు. పై వారంలో మంచి రోజు చూసి బయలుదేరి వస్తాం......'' అన్నాడు.

రాజశేఖరం మరో కుర్చీలో కూర్చుంటూ ''అబ్బో! చాలా దూరం వచ్చిందే... నేను లేకుండానే అన్ని విషయాలూ మాట్లాడుకున్నారన్నమాట...'' అన్నాడు.

విశ్వనాథంగారు ''అదేమిటోయ్ అలాగంటావు? వారిని తీసుకువచ్చింది నువ్వేగా? పైగా నువ్వు ఇద్దరికీ కావలసిన వాడివి. పెళ్లి నీ అజమాయిషీ క్రిందనే జరిపించి...పెద్దలం ఆనందిస్తాం. పైగా ఆడపిల్ల కలవాడివి. అనుభవం ఉండటమూ మంచిదే...'' అన్నారు.

తర్వాత ముగ్గురూ ఏవేవో విషయాలు మాట్లాడ్కున్నారు. చివరకు ఉద్దండరావు పంతులు లేచి నిలబడి ''ఇక పోదాం పదవోయ్'' అన్న తర్వాత రాజశేఖరం కూడా లేచి ''వెళ్లొ

స్తాం చిన్నాన్నా" అంటూ బయలుదేరాడు. అతనిలో ఆ ఒక్క పూటలోనే చిత్రమైన మార్పు వచ్చింది. ఎంతో పెద్దరికం వచ్చినవాడిలా తయారైనాడు.

ఇద్దరూ వీథిలోకి వచ్చి నడవటం ప్రారంభించారు. ఉద్దండరావు గారు ఉన్నట్టుండి "అన్నట్టు చూడు రాజా! కుర్రవాణ్ణి నేను చూడనేలేదు. ఎలా ఉంటాడో ఏమిటో! మన పిల్లకు తగినవాడవునో కాదో...ఎలా ఇప్పుడు?..." అన్నాడు.

రాజశేఖరం "అదేమిటండీ? మీరేమాత్రమూ సందేహించనక్కరలేదు. నిక్షేపంలా ఉంటాడు. మీకు తప్పక నచ్చుతాడని కూడా నా అభిప్రాయం...." అన్నాడు..

ఉద్దండరావు పంతులు ఆ సమాధానంతో సంతృప్తిచెందినట్లు లేదు. ఆయన చేతి కర్రవూపుకుంటూ విసురుగా నడుస్తున్నాడు. రాజశేఖరం ఉన్నట్టుండి ముందుకు చూసి ఆగిపోయి "మేష్టారూ" అడుగో ఆ వస్తున్న కుర్రవాడే....వెయ్యేళ్లాయుస్సు ఉంటుంది. మాటలో వచ్చాడు...." అన్నాడు. దేవుడు పంపినట్టు సరిగా సమయానికి అతడా వీథిన రావడం అతనికెంతో ఆనందం కలగజేసింది.

అతడు దగ్గరికి రాగానే రాజశేఖరం అతన్ని పలకరించి "ఏమోయ్ అభిమన్యా! ఏమిటి విశేషాలు? నాక్కనిపించడమే మానేశావేం? ఇంటి దగ్గర ఏమీ తోచటంలేదన్నావుటగా? పోనీ మా ఇంటికి రాగూడదూ? లేకపోతే ఆఫీసుకు వచ్చి నాకు కొంచెం సాయం చెయ్యగూడదా?" అన్నాడు.....

అతడు రాజశేఖరం మాటలు విని బిడియపడుతూ నవ్వాడు. అతడు మంచి పొడగరి. పొడుగుకు తగ్గ లావున్నాడు..పచ్చని శరీర చ్ఛాయ. కోల ముఖం..నిరంతరం ఆలోచిస్తున్నట్టుండే కన్నులు. ఉద్దండరావు పంతులు సంతృప్తి చెంది హఠాత్తుగా అతని భుజంమీద తట్టి "ఐ లైక్ యు..." అన్నాడు.

అతడు తెల్లబోగా రాజశేఖరం కన్నుగీటి సైగచేసి "రండి మేష్టారూ?" అంటూ ముందుకు నడిచాడు. ఇద్దరూ వడివడిగా ఇంటి ముఖం పట్టారు.

అప్పటిదాకా ఆకాశం తంతా మబ్బులుపట్టి 'ఏక్షణంలో కురుస్తుందో' అన్నట్టుంది. వారిద్దరూ ఇల్లు చేరుకోగానే సన్నగా జల్లు ప్రారంభమైనది. వసంత పిల్లలిద్దరికీ అన్నాలు పెట్టడం అయిన తరువాత వారి చేత చదివిస్తున్నది.

వీరిద్దరూ లోపలికి రాగానే ఆమె ఎదురు వచ్చి "అమ్మయ్య వచ్చేశారా? వర్షం వచ్చేటట్లుంది. వీళ్ళిద్దరూ కారైనా తీసుకుపోకుండా నడిచే వెళ్లారే...." అని ఇందాకటి నుంచీ దిగులుపడుతున్నాను. అన్నట్టు వెళ్ళిన పని ఏమయింది?" అని అడిగింది.

రాజశేఖరం చొక్కా విప్పుతూ "ఏమవుతుందీ? పై వారంలో పిల్లను చూసుకునేందుకు వస్తావన్నారు వాళ్ళు..." అని చెప్పాడు.

*   *   *   *

ఆ రాత్రి ఘోరున వర్షం కురుస్తూ ఉండగా ఒంటిగంట వేళకు ఉద్దండరావు పంతులు నిద్రలేచి 'రాజా రాజా' అని పిలుస్తూ పడక గది తలుపు తట్టడం ప్రారంభించాడు.

రాజశేఖరం లేచి తలుపు తీసి "ఏమిటి మేష్టారూ? ఏం కావాలి? " అని అడిగాడు.

ఉద్దండరావు గారు త్వర త్వరగా లాల్చీ తొడుక్కుని గుండీలు పెట్టుకుంటూ "నా చేతి కర్ర ఏదీ? నువ్వూచొక్కా తొడుక్కో.... త్వరగా స్టేషనుకు బయలుదేరు... నేను వెంటనే మాఊరికి వెళ్ళిపోవాలి. ఒంటిగంట బండికి ఇరవై నిముషాలే వ్యవధి ఉంది...." అన్నాడు.

రాజశేఖరం ఆశ్చర్యంతో "ఇప్పుడేం తొందర మేష్టారూ! తెల్లవారిన తర్వాత పోగూడదూ? అంత ముంచుకు పోయే పనులేమున్నాయి గనుక?.." అన్నాడు.

ఆయన చేతి కర్ర వెదికి తీసుకుని " భలేవాడివే..నువ్వేం అడ్డు చెప్పకు..నేనీ బండికి వెళ్ళి తీరాలి. అక్కడ మా అబ్బాయి కోడలూ నేను కనబడక ఎంత దిగులు పడిపోతున్నారో...ఊఁ కానివ్వు. త్వరగా బయలుదేరు...."అన్నాడు హడావిడిగా.

రాజశేఖరం నివ్వెరపోయి తలయెత్తి "అదేమిటి? మీరు ఇంటిదగ్గర చెప్పిరాలేదా?" అని అడిగాడు.

ఉద్దండరావుగారు తల అడ్డంగాఊపి "లేదుగా" అన్నాడు. ఈ లోపల వసంత నిద్రలేచి వచ్చి గుమ్మాని కానుకొనినుంచున్నది.

రాజశేఖరం త్వర త్వరగా చొక్కా తొడుక్కుని సిద్ధమైనాడు. ఉద్దండరావు పంతులు వసంత నుద్దేశించి "అమ్మాయ్, వెళ్ళొస్తానమ్మా!" అని చెప్పి ఇవతలికి వచ్చాడు.

ఇద్దరూ కారులో స్టేషనుకు వెళ్ళేసరికి రైలు సిద్ధంగా ఉంది. రాజశేఖరం "మేష్టారూ! మీరు వెళ్లి ఎదురుగా ఉన పెట్టిలో కూర్చోండి. నేను టికెట్టు తీసుకొస్తాను! అంటూ కౌంటరు వైపు పరుగెత్తాడు.

అతడు టికెట్టు తీసుకుని ప్లాట్‌ఫారంమీదికి వెళ్ళేసరికి ఉద్దండరావు పంతులు ఒక పెట్టిలో కిటికీ పక్కగా వీలుగా హాయిగా కూర్చొని ఉన్నాడు. రాజశేఖరాన్ని చూసి ఆయన "ఏదీ టికెట్టు తెచ్చావా? ఇలా ఇవ్వు. దీన్నికూడా నాదగ్గరే ఉంచుకుని మా మనవరాలికి ఇస్తాను..." అన్నాడు గొణుక్కుంటున్నట్లు.

రాజశేఖరం, జేబులో నుంచి అయిదు వందరూపాయల నోట్లు తీసి టికెట్టుతో సహా ఆయన చేతిలో ఉంచాడు. ఆయన

వాటిని తీసుకుని. అందులో ఒక నోటు ఇవతలికి తీసి రాజశేఖరం జేబులో ఉంచుతూ "కాదనకు తీసుకో.. ఆడపిల్లకేదైనా వస్తువు చేయించు...." అన్నాడు.

రాజశేఖరం త్రుళ్ళిపడి "అబ్బే! ఎందుకు మాష్టారూ! ఒద్దు ఒద్దు, అంటూనే ఉన్నాడు, ఆయన బలవంతంగా అతని జేబు అదిమిపట్టి ఉంచి "కాదనకు...పెద్దవాణ్ణి నేనిస్తే కాదనవచ్చా? పిల్లకు మెళ్ళోకి ఏదైనా చేయించు...." అన్నాడు మళ్ళీ దృఢ స్వరంతో.

బండి కదిలింది. క్రమ క్రమంగా వేగం హెచ్చి రైలు ప్లాటుఫారం వదలి పోయింది. రైలు కిటికీలోనుంచి వెలుగు నీడలు వరుసగా ముఖం మీద పడుతూ ఉండగా ఉద్దండరావు పంతులు రాజశేఖరం వంక కనిపించినంత సేపూ చూస్తూనే ఉన్నాడు. తననుంచి దూరమై పోతున్న కొద్దీ ఆయన ముఖంలో ఏదో వివరించరాని చిత్రమైన ఆవేదన రాజశేఖరం మనసును కలచి వేసింది. అతడు నిట్టూర్చి స్టేషను బయటికి వచ్చి కారులో కూర్చుని స్టార్టు చేసి ఇంటి ముఖం పట్టాడు.

* * * *

మూడవ రోజున ఆఫీసునుంచి ఇంటికి రాగానే వసంత, రాజశేఖరానికి ఒక కవరు ఇచ్చింది. అతడు తీరికగా కూర్చుని ఈలవేస్తూ దాన్ని చింపి చూశాడు.

భర్తకోసం కప్పులోకి కాఫీ వంచుతున్న వసంత అతని ఈలల హఠాత్తుగా ఆగిపోవడంతో తల ఎత్తి చూసింది. రాజశేఖరం చేతిలో ఉత్తరం రెపరెపలాడుతున్నది. అతని ముఖంలో రంగులు మారాయి. అతని చూపులెక్కడో ఉన్నాయి. ఆమె ఆ ఉత్తరం తీసుకుని ఇలా చదువుతున్నది.

ప్రియమైన రాజా!

ఉదయమే మానాన్నగారు ఇంటికి వచ్చారు. మొన్నరాత్రి నుంచి ఆయన కనుపించని కారణంగా మేమెంతో ఆదుర్దా పడ్డాము. వచ్చాక, 'ఎక్కడికి వెళ్లారని' అడిగితే అంతా చెప్పారు: ఆయన రోజల్లా మీ ఇంట్లో ఉండి ఏమి చెప్పి ఉంటారో నాకు తెలుసు. ఇటీవల ఆయన చాలా చిత్రంగా ప్రవర్తిస్తున్నారు. మనవరాలి పెళ్లి ఒక పెద్ద సమస్య అని తనలో తాను బాధపడి వారినీ, వీరినీ సంబంధాలు చూడమనటం, తాను స్వయంగా వెళ్లి చూడడం, కొందరిని పిల్లను చూసుకునేందుకు ఇంటికి రమ్మనటం జరిగింది. ఎవరైనా వెంటనే నమ్మేట్టు అతి సహజంగా ఆయన చెప్పడంవల్ల కొందరు వచ్చారుకూడా. వారి కాళ్ళ గడ్డాలూ పుచ్చుకొని బతిమాలి మేము సమాధానపరచవలసి వచ్చింది. ఇంతకూ ఆయన తనకున్నదనుకుంటున్న మనవరాలు అసలు లేదు. నీకు బాగాతెలియదేమో. మాకింతవరకూ సంతానం లేదు. పదిహేడు సంవత్సరాలనుంచీ కాపురం చేస్తున్నప్పటికీ మాకు ఒక్క నలుసు కూడా కలగలేదు. అది ఆయనచింత... చక్కని మనవరాలిని ఎత్తుకొని వార్ధ్యకంలో హాయిగా ఉండాలని ఆయన కోరిక కాబోలు. అది నెరవేరని కారణంగా ఆయన ఒక ఊహాచిత్రం గీచుకొని ఆనందిస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఎదురుగా ఒక బొమ్మను ఉంచుకుని దానితో కబుర్లు చెబుతూ ఉంటారు. ఆ బొమ్మకి ఒక అందమైన పేరుకూడా ఉంది, నయనతార అని.

మీ ఇంటి దగ్గర ఎలా ప్రవర్తించారో తెలియదు. ఇప్పుడు దూరంగా ఉంటున్నప్పటికీ మనం చిన్నప్పటినుంచీ అన్నదమ్ములవలె పెరిగిన వాళ్లం. ఆయన మీకేదైనా ఇబ్బంది కలిగించి ఉంటే మన్నింపగలవు....

ఇంతే సంగతులు,
రమాపతిరావు.